నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 31 డిసెంబర్ 2023 | ADILABAD

## నాగోబాను దర్శించుకున్న ప్రశాంతి

ఇంద్రవెల్లి, డిసెంబర్ 30 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్‌లో గల నాగోబా ఆలయాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంతి దర్శించుకున్నారు. శనివారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెను మెస్రం వంశీయులు నాగోబా ఫొటోను బహూకరించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్ పటేల్, స్థానిక సర్పంచ్ మెస్రం రేణుకానాగ్‌నాథ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం పాల్గొన్నారు.


రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంతిని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

## వైద్య సిబ్బందికి అభినందనలు

నార్నూర్, డిసెంబర్ 30 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ వైద్యులను ఎన్‌క్యూస్ కేంద్రీయ బృందం ప్రతినిధులు అభినందించారు. రెండు రోజులుగా పర్యటిస్తున్న బృందం సభ్యులు.. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకున్నా సేవలు అందించడం హర్షనీయమని పేర్కొన్నారు. శనివారం వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం దవాఖాన ఆవరణలో మొక్క నాటారు. సిబ్బంది పలు సమస్యలను ప్రతినిధులకు విన్నవించగా.. ప్రభుత్వానికి చెప్పి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, డీఎంవో శ్రీధర్, వైద్యాధికారి సంజీవ్‌కుమార్, ఎంవో రవీందర్, హెచ్‌ఈ సంజయ్, హెచ్‌ఎస్ అమర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో బృందం ప్రతినిధులు


బైంసా : ఈకేవైసీ చేసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

# ఈకేవైసీ.. హైరానా..

## గ్యాస్ ఏజెన్సీల ఎదుట జనం బారులు

- ఉదయం నుంచి చంటి పిల్లలతో మహిళలు, వృద్ధుల నిరీక్షణ
- రూ.500ల సిలిండర్ కోసం చేసుకోవాలనే అపోహ
- ఉజ్వల పథకం కనెక్షన్లకే ప్రస్తుతం వర్తింపు
- మరుగుదొడ్లు, తాగునీరు లేక అవస్థలు



### మూడు రోజులుగా వస్తున్న..

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 30: మాది నిర్మల్ మండలం మేడిపల్లి గ్రామం. గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని అనడంతో నిర్మల్ పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీకి మూడ్రోజులుగా వస్తున్న. ఇంతవరకు పని కాలేదు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇక్కడే ఉంటున్న. జనం ఎక్కువగా ఉండడంతో వేచి చూడాల్సి వస్తున్నది. మేడిపల్లి నుంచి నిత్యం ఆటోలో వస్తున్న. పొద్దంతా లైన్‌లో ఉన్నా పని అయితలే. టోకెన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందవుతున్నది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తున్నది. రోజుకు రూ.వంద ఖర్చవుతున్నది. హోటల్లో తినాల్సి వస్తోంది. గిట్ల ఒకేసారి ప్రజల్ని ఇబ్బంది పెట్టుడు మంచిది కాదు.

**-రాజమణి, మేడిపల్లి**

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ ) : ఈకేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) కోసం గ్యాస్ వినియోగదారులు హైరానా పడుతున్నారు. నేటి (ఆదివారం)తో గడువు ముగుస్తున్నదనే ప్రచారంతో ఏజెన్సీల ఎదుట బారులుదీరుతున్నారు. ఉదయమే వృద్ధులు, పిల్లాపాపలతో మహిళలు పల్లెల నుంచి తరలివచ్చి నిరీక్షిస్తున్నారు. ఐదు నిమిషాల పనే అయినప్పటికీ వచ్చే వారి సంఖ్య వందల్లో ఉండడం, రోజు 700 నుంచి 1000 వరకు ఈకేవైసీ చేయాల్సి వస్తుండడం, సర్వర్ డౌన్ వల్ల ఆలస్యం అవుతున్నదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో వినియోగదారులు గంటల తరబడి వేచి ఉంటున్నారు.కొన్ని ఏజెన్సీల వద్ద మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు.


నిర్మల్ చైన్‌గేట్ : ఈకేవైసీ చేసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుదీరిన ప్రజలు

### రూ.500ల సిలిండర్‌కు సంబంధం లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.500ల సిలిండర్‌కు, ఈకేవైసీకి సంబంధం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే వర్తిస్తున్నది. ఇందుకు డిసెంబర్ 31వ తేదీ డెడ్‌లైన్ పెట్టింది. దీపం, సీఎస్‌ఆర్, వ్యక్తిగత కనెక్షన్ల వినియోగదారులు ఎప్పుడు వెళ్లినా ఏజెన్సీల్లో ఈకేవైసీ చేస్తారు. కానీ.. అధికారులు చెప్పినా జనం పట్టించుకోవడం లేదు. నేటితో ఉజ్వల పథకానికి ఈకేవైసీ గడువు ముగియనుండడంతో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీల వద్ద క్యూలైన్లు కనిపించాయి. అసత్య ప్రచారం నమ్మి, తొందర పడి ఎవ్వరూ ఏజెన్సీలకు రావొద్దని అధికారులు, నిర్వాహకులు సూచిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు**

| జిల్లా | కనెక్షన్ల సంఖ్య |
|---|---|
| ఆదిలాబాద్ | 36,098 |
| నిర్మల్ | 37,328 |
| మంచిర్యాల | 30,322 |
| ఆసిఫాబాద్ | 23,255 |
| దీపం, సీఎస్‌ఆర్, వ్యక్తిగత కనెక్షన్లు | 7.68 లక్షలు |



### ఈకేవైసీకి వస్తే సురక్ష పైపులు అంటకట్టిన్రు..

బెల్లంపల్లి, డిసెంబర్ 30 : నా పేరు జ్యోతి. మాది మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని రాంపూర్ గ్రామం. ఉదయం 8 గంటలకు బయలుదేరి బెల్లంపల్లికి 9 గంటలకు చేరుకున్నా. 20 కిలోమీటర్ల దూరం ఉండగా.. రూ.50 చార్జి పెట్టుకొని ఆటోలో వచ్చిన. ఈకేవైసీ చేసుకోవాలని అరవింద్ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూలో నిలబడ్డా. ఈకేవైసీ చేసుకోవాలంటే రూ.200 పెట్టి సురక్ష గ్యాస్ పైపు కొనాలని నిర్వాహకులు అన్నారు. ఉచితంగా చేస్తున్నారు కదా అని అడిగా. పైపు కొంటేనే ఈకేవైసీ చేస్తామని చెప్పారు. నా వద్ద డబ్బులు లేకపోవడంతో మా బంధువుల ఇంటికెళ్లి తీసుకచ్చుకున్నా. పైపు తీసుకొని ఈకేవైసీ చేసుకున్న. మరికొందరికైతే గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం ఏకంగా రూ.1,300 తీసుకున్నారు. డబ్బులు గుంజుడే గుంజుతున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలేమో గానీ మా పైసలన్నీ గుల్లా చేస్తున్నారు.

### చలిలో చచ్చిపోతున్నం..

మాది మామడ మండలం కిషన్‌రావు పేట గ్రామం. వ్యవసాయ కూలీగా పని చేస్తున్న. నిర్మల్‌లో గ్యాస్ కనెక్షన్ ఉంది. గిప్పుడు ఈకేవైసీ చేయాలనే నిబంధన పెట్టడంతో రెండు రోజుల నుంచి తిరుగుతున్నా పని కాలేదు. అటు కూలి పనికి కూడా పోతలేను. రోజూ రూ. 60 ఆటో ఖర్చే అవుతున్నది. చలికాలం కావడంతో ఉదయమే ఊరి నుంచి రావడానికి ఇబ్బందవుతున్నది. గ్యాస్ సెంటర్ వద్దే ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తున్నది. జనం ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నయ్. హోటల్లోనే తినాల్సి వస్తున్నది. గీ నిబంధన ఎందుకు పెట్టిన్రో అర్థమైతలేదు. మేమైతే చాలా ఇబ్బంది పడుతున్నం.

**- లలితా రాథోడ్, కిషన్‌రావుపేట**



### 50 రోజుల వరకు టోకెన్లు లేవనే బోర్డు

ఆదిలాబాద్ పట్టణంలోని ఆధార్ కేంద్రాల్లో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు తీసుకోవడం లేదని నిర్వాహకులు బోర్డులు పెడుతున్నారు. ఇంకా.. 50 రోజుల వరకు టోకెన్ల పంపిణీ పూర్తయిందని, తర్వాత వచ్చి తీసుకుని మేము సూచించిన రోజు వచ్చి అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఫిల్టర్‌బెడ్ ఉన్న ఆధార్ కేంద్రంలో ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత టోకెన్లు ఇస్తామని సూచించారు. దీంతో దరఖాస్తుదారులు చేసేది లేక నిరాశతో వెనుదిరిగి పోతున్నారు.



ఫిబ్రవరి 20వ తేదీ తర్వాత టోకెన్లు ఇస్తామని పెట్టిన బోర్డు

### ఎప్పుడైనా చేసుకోవచ్చన్నరు..

మా వీధిలో అందరూ ఈకేవైసీ చేయించుకుంటున్నరు. ఇవాళ లాస్ట్ రోజు అన్నరు. అందుకే పని వదులుకుని మరీ వచ్చిన. ఇక్కడికి వచ్చినంక నాకు ఇంకా టైమ్ ఉందని చెప్తున్నరు. మాది ఉజ్వల కనెక్షన్ కాదు. అందుకని ఎప్పుడు వచ్చినా చేస్తరంట. పని వదులుకుని వచ్చినందుకు బాధగా ఉంది. మా గల్లీలో ఈకేవైసీ టాకే నడుస్తున్నది. రూ.500 సిలిండర్ రావాలంటే వెంటనే చేయించాలని చర్చించుకుంటున్నరు. అంతా అబద్ధమని ఇక్కడికి వచ్చినంక తెలిసింది.

**- మల్యాల నర్సయ్య, గ్యాస్ వినియోగదారుడు, మంచిర్యాల.**




ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ ఎంపీని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# గులాబీ సత్తా చాటాలి..

**పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో నిరూపించాలి..**
**నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే**

ఇచ్చోడ, డిసెంబర్ 30 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ సత్తా చూపించాలని.. పార్లమెంట్, స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో బోథ్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి జోగు రామన్న, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ నగేశ్ హాజరయ్యారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైతే స్పందించాలని, ప్రజల గొంతుకగా నిలబడాలని దిశానిర్దేశం చేశారు. తమపై ఉన్న విశ్వాసాన్ని ఓట్ల రూపంలో చూపించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సుభాష్, బోథ్ జడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

సిరికొండ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్, మాజీ ఎంపీ నగేశ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మద, ఎంపీటీసీ పర్వీన్, ఉప సర్పంచ్ చందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నరెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

# పకడ్బందీగా నిర్వహించాలి..

- నిర్మల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్
- పలు గ్రామాల్లో 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ

సారంగాపూర్, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. నిర్మల్ మండలంలోని కంకెట గ్రామంలో శనివారం జరిగిన గ్రామసభను పరిశీలించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని జనవరి 6వ తేదీ వరకు స్వీకరిస్తారని.. ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను కౌంటర్లలో అందజేయాలని పేర్కొన్నారు. అలాగే ధని, రాం సింగ్‌తండా, యాకర్‌పల్లి గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో సరోజ, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్‌ఐ ముంతాజ్, ఏపీఎం మాధురి, ఏఈ రాజేందర్ పాల్గొన్నారు.


ఆర్జీయూకేటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# ల్యాప్‌టాప్‌ల పంపిణీ

బాసర, డిసెంబర్ 30 : నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఆర్జీయూకేటీని ఉన్నత విశ్వ విద్యాలయంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ పరంగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆర్జీయూకేటీని ప్రముఖ విశ్వ విద్యాలయంగా మార్చేందుకు రోడ్ మ్యాప్‌ను సమర్పించాలని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ వెంకటరమణ, విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇదేనా.. ప్రజాపాలన?

**కాంగ్రెస్ నాయకులపై ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు**

ఎదులాపురం, డిసెంబర్ 30 : ఇటీవల మంత్రి సీతక్క నేతృత్వంలో అధికారికంగా జరిగిన సమీక్ష సమావేశానికి కొంతమంది కాంగ్రెస్ నాయకులు హాజరు కావడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ నిరంకుశ పాలనకు పాల్పడుతున్నారు. ఇలాంటి చర్యలను అరికట్టాలని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి ఫిర్యాదు చేశారు. అధికారిక సమావేశాల్లో పాల్గొన్నారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపీపీలు గోవర్ధన్, గంద్రత్ రమేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రహ్లాద్, నాయకులు ఉన్నారు.


రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# లక్ష్యాలను పూర్తి చేయండి..

- రాష్ట్ర పౌర, సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్

ఎదులాపురం, డిసెంబర్ 30 : వానకాలం, యాసంగి పంటకు సంబంధించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌర, సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సచివాలయం నుంచి కలెక్టర్లు, పౌర, సరఫరాల శాఖ అధికారులతో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)పై వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిల్లర్లకు కేటాయించిన రోజు వారి లక్ష్యాలను పూర్తి చేయడానికి కలెక్టర్లు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ వీసీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్